(మినీ కథ)

# ఏ కథ కావాలి?

రచన:
శ్రీ టి. ఎస్. ఆనంద్

ఏమీ తోచక, టైం పాస్ కోసం గ్రంథాలయం వైపు వెళ్ళాడు రాజేష్. అచేతనంగా లైబ్రరీలో పుస్తకాలన్నీ తిరగేస్తున్నాడు. అతని దృష్టి ఓ మాస పత్రికపై పడింది. ఓసారి పేజీలు తిరగేస్తూ, తక్కున ఓ పేజిపై దృష్టి పడింది రాజేష్‌కి.

దీపావళి మినీ కథల పోటీలు - మొదటి బహుమతి: 516. రెండవబహుమతి : 400. 3 వ బహుమతి : 316. రచనలు రెండు అర తావులకు మించరాదు. ఇతివృత్తం సాంఘికమై వుండాలి. కాగితానికి ఓ ప్రక్కనే వ్రాయాలి. అనువాద-అనుకరణ కాని స్వంత రచన అని హామీ రచయిత యివ్వాలి. పోటీకి కథలు చేరవలసిన ఆఖరు తేది ''.........?'' అని వుంది.

కథలు పంపవలసిన చిరునామా నోట్ చేసుకున్నాడు రాజేష్. యాంత్రికంగా లేచి యింటి దారి పట్టాడు రాజేష్.

తను కథ వ్రాయాలి? ఆలోచనలో పడ్డాడు రాజేష్. యాంత్రికంగా లేచి యింటి దారి పట్టాడు రాజేష్.

తను ఏకథ వ్రాయాలి? ఆలోచనలో పడ్డాడు రాజేష్. ప్రేమకథ వ్రాద్దామా? ఛ. హీరో-హీరోయిన్లలో ఎవరో ఒకర్ని విడగొడితే గాని ప్రేమ అన్పించుకోదు. ఇలాంటి కథ లెన్ని రాలేదూ? అపరాధ పరిశోధన - సస్పెన్స్ కోసం నానా హైరానా పడాలి...నో-నో మరెలాంటి కథ వ్రాయాలి?

టేబుల్ పై వున్న సిగరెట్ తీసి వెలిగించాడు. ఊహూం - లాభం లేకపోయింది. పోటీకి పంపడానికి యింకా మూడు రోజులే గడువు. ఆలోచనతో కణతలు వేడెక్కాయి. అలా వీధిలోకి వెళ్ళొద్దాం అనుకుంటూ బయలుదేరాడు.

తల్లి పాలు చాలక రొమ్ములు గుద్దుతున్న పసివాడు. ఏడుపు. ఆ ఏడుపును చూస్తూ తన నిస్సహాయతను వెల్లడి చేస్తున్న ఆ దీనురాలి ముఖాన్ని చూచాడు పేవ్‌మెంట్ పై రాజేష్. హృదయం ద్రవించింది. ఆమె ఎదుట పరచిన గుడ్డపై ఓ రూపాయి నోటు వేసి ముందుకు కదిలాడు.

ఎముకలగూడు బయటకు కన్పడుతూ, డొక్క చాలా లోతుకు పోయి, మాసిన గడ్డంతో, చెదిరిన జుత్తుతో, జీర్ణించిన వస్త్రములతో హీనంగా-దీనంగా 'ఆకలి-ఆకలి' అన్న దైన్యపు పిలుపుకి చలించాడు రాజేష్. అన్నపూర్ణ దేశమా యిది? అనుకుంటూ తనకు తోచిన సాయం చేశాడు.

మరికొంత దూరం వెళ్ళేసరికి జనం గుంపులు గుంపులుగా గుమిగూడ్డం చూచాడు రాజేష్. ఏమిటని ఒకతన్ని అడిగాడు. ఏమి చెప్పడం బాబూ! ఓ ఆడకూతురి చావు అన్నాడు. ఎలా జరిగింది? ఇంకొకడ్ని ప్రశ్నించాడు రాజేష్.

కట్నం బాబూ! కట్నం. ఈ పిల్లకి పెళ్ళి చేసిన తండ్రి అనుకున్న సమయానికి కట్నం అందించలేక సగం తీర్చి, సగం తర్వాత యిస్తానన్నాడట. ఈలోగా అతనికి డబ్బు కుదర్లేదు.

ఓ ప్రక్క కట్టుకున్న మొగుడు, మరో ప్రక్క అత్త మామల పోరు భరించలేక, అదిగో ఆ నూతిలో పడి ఇటు తలిదండ్రులకు - అటు అత్త వారింటికి బరువు కాకుండా ఋణం తీర్చుకుంది - అన్నాడవతల వ్యక్తి.

రాజేష్ మస్తిష్కంలో ఎన్నో ఆలోచనలు రింగిన తిరిగాయి. ఎదురుగా గోడమీద - ఆడ వాళ్ళకు సమాన హక్కు రావాలన్నా, వరకట్న పిశాచి నిర్మూలన కావాలన్న - అందరికీ ఆకలి బాధ లేకుండా చేయాలన్న - పీడిత ప్రజానీకానికి అన్ని వసతులు కావాలన్న "అరచేతి వైకుంఠం గార్కే మీ ఓటు వేసి గెల్పించండి!" అన్న ఓటింగ్ వ్రాతలు గోడపై సాక్షాత్కరించాయి. వ్రాసిన వ్రాతలకు, చెప్పిన నీతులకు, చేస్తున్న పనులకు పొంతం లేని ఈ దేశం బాగుపడే దెప్పుడు? అనుకున్నాడు. ఇంటి ముఖం పట్టాడు రాజేష్.

కవి వ్రాయవల్సినవి ప్రేమకథలు కావు - అవాస్తికత రచనలు కావు. నిత్యం సమాజంలో జరుగుతున్న వాస్తవిక కథలు వ్రాయాలి. మనసును చంపుకొని, అధికారంతో, ధన బలంతో విర్రవీగుతున్న వాళ్ళను పొగిడి, వాళ్ళను మంచి వాళ్లుగా చిత్రీకరించడం కాదు. వాళ్ళలో దాగిన అవినీతిని బయటకు తీసి, దానికి పరిష్కార మార్గం రచన ద్వారా చూపెట్టాలి. ఎందరో అభాగ్యులు - అవినీతి కోరల్లో, అరాచికపు విష కోరల్లో నలిగిపోతున్న విషాద గాథలు - అన్నార్తుల ఆకలి మంటలు - నిరుద్యోగుల అగచాట్లు యిలా ఎన్నో - ఎన్నెన్నో నిత్యం జరుగుతున్న మనుషుల కథలు వ్రాయాలి అనుకున్నాడు తనలో...

ఏదో నిర్ణయానికి వచ్చాడు. అతనిలో ఏదో వెలుగు తళుక్కుమని మెరిసింది. కలం పట్టి కథకు శ్రీకారం చుట్టాడు.

ఆ కథ - ఎందరికో మార్గం కావాలన్న ధ్యేయంతో!



ESTD 1959

మాచే తయారుచేయబడిన ఆర్ట్ సిల్కు జమకాళాలు, కాటన్ జమకాళాలు మరియు బెడ్ షీట్లు అత్యంత ప్రసిద్ధమైనది.

ఇవికాక కళ్యాణ మంటపాలకు కావలసిన హాల్ జమకాళాలు ఎంత పెద్దది కావలసినా మేము తయారించి ఇవ్వగలము. వీటి అర్డరు బుక్ చేయుటకు కమిషన్ పద్ధతిపైన ఏజెంట్లు కావలెను.

: తయారుచేయువారు :

**Supreme Textiles-Bhavani-638 301**